క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ వేగవంతం



ఏఎన్ఎంల నుంచి వివరాలు తీసుకుంటున్న ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీని వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య ఏఎస్ఎంలు, కార్యదర్శులను ఆదేశించారు. ఆయన తన కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. సబ్ సెంటర్లు, సచివాలయాల ఏఎస్ఎంల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈకేవైసీ విధిగా చేసి కార్డులను అందజేయాలన్నారు. మండలానికి 13 వేల ఆరోగ్యశ్రీ కార్డులున్నాయన్నారు. వాటిలో 500 మంది మరణించారన్నారు. వాటిని తొలగించి మిగిలిన వారికి పంపిణీ చేయాలన్నారు.

యువ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు



విజ్ఞాన కేంద్రం వద్ద యువతతో సంస్థ డైరెక్టర్ వికాష్‌బాలరాజు

అనంతగిరి: అరకులోయ పద్మాపురం నేచర్ ఆధ్వర్యంలోని యువ విజ్ఞాన కేంద్రాన్ని నేచర్ సంస్థ డైరెక్టర్ వికాష్ బాలరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతగిరి, అరకువేలి, డుంబ్రిగుడ మండలాల్లో 78 పంచాయతీల్లో 700 మంది యువతకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా శిక్షణ తీసుకున్న యువత అవగాహన కల్పిస్తారన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలోని నేచర్ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ శ్రీనివాస్

రాజవొమ్మంగి: స్థానిక వేంకటేశ్వర స్వామివారి ఆలయ సమీప వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పీఆర్ డీఈ శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. 70 మీటర్ల పొడవున, రూ. 3.50 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా రాజవొమ్మంగి పంచాయతీ పరిధి గ్రామాలకు రూ. 40 లక్షలతో మంజూరైన 14 సీసీరోడ్ల నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

3,245 మందికి పల్స్ పోలియో లక్ష్యం

రాజవొమ్మంగి: మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో ఐదేళ్లలోపు 3,145 మంది చిన్నారులకు పోలియో చుక్కల మందు పంపిణీ లక్ష్యమని వైద్యాధికారులు తెలిపారు. రాజవొమ్మంగి పీహెచ్‌సీ పరిధి 28 గ్రామాల్లో 1100 మంది చిన్నారులకుగాను, 26 బూత్‌లు ఏర్పాటు చేశామని డాక్టర్ నాగార్జున తెలిపారు. జడ్డంగి పీహెచ్‌సీ పరిధి 37 లోతట్టు గ్రామాల్లో 1,461 మంది చిన్నారులకుగాను 25 బూత్‌లను ఏర్పాటు చేశామని డాక్టర్ యామిని ప్రియ తెలిపారు. లాగరాయి పీహెచ్‌సీ పరిధి 24 గ్రామాల్లో 684 మంది చిన్నారులకుగాను 15 బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు మందు పంపిణీ చేయనున్నట్లు సీహెచ్ఓ కృపాచార్యులు తెలిపారు.

సందడిగా ప్రజాపోరు యాత్ర ముగింపు

జి.మాడుగుల: కె.కోడాపల్లి పంచాయతీ పరదేశిపు గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర ముగింపు కార్యక్రమం గురువారం సందడిగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర మేధావుల విభాగం అధ్యక్షురాలు కురుసా పార్వతమ్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నూకరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



చింతూరు పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ ఎలిజబెత్



కూనవరం కేంద్రంలో రూమ్‌లను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి



ముంచంగిపుట్టు కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



హుకుంపేట పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ సన్యాసినాయుడు

చింతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లను చీఫ్ సూపరింటెండెంట్ ఎలిజబెత్, డిపార్ట్‌మెంట్ అధికారి గోవింద్ గురువారం పరిశీలించారు. ఇక్కడ జూనియర్ కళాశాలతోపాటు గురుకులం, కేజీబీవీ విద్యార్థులు ఫస్టియర్‌కు చెందిన 469 మంది, సెకండియర్‌కు చెందిన 224 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

కూనవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీయట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని ప్రిన్సిపాల్ ఎస్. శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఇక్కడ స్థానిక కళాశాలతోపాటు నెల్లిపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోతులగుట్ట ఏపీటీడబ్ల్యూఆర్ గురుకులం, కేజీబీవీ విద్యార్థులు మొత్తం 524 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు 13 రూమ్‌లు కేటాయించామని, సీసీ కెమెరాలు, తాగునీటి సౌకర్యం, మెడికల్ స్టాఫ్, పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు.

వీఆర్‌పురం: ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ పి.రాజా గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రారంభం కానున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 44 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని సూచించారు.

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరంలో 304 మంది, ద్వితీయ సంవత్సరంలో 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

అడ్డతీగల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు 546 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ప్రిన్సిపాల్ మదీనా తెలిపారు. వీరిలో మొదటి సంవత్సరం 365 మంది, ద్వితీయ సంవత్సరం 181 మంది ఉన్నారన్నారు. అడ్డతీగల కళాశాలతోపాటు గురుకుల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలుగా ఉంటాయన్నారు. 15 సీసీకెమెరాలు అమర్చామన్నారు.

జి.మాడుగుల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రిన్సిపాల్ కె.కె. దొర తెలిపారు. ప్రథమ సంవత్సరం 537 మంది, ద్వితీయ సంవత్సరం 400 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు.

హుకుంపేట: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీఐ ఎస్ సన్యాసినాయుడు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జ్ఞానసాగర్ ఒకేషనల్ కళాశాల, కేజీబీవీ, జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు 367 మంది పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మట్లపాడులో 'గడప గడపకు'

అడ్డతీగల: మండలంలోని మట్లపాడు పంచాయతీలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.రంగారావు తెలిపారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై రంగారావు

దేవీపట్నం: వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు వహించాలని ఎస్సై రంగారావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండమొదలు కాలనీలో గురువారం ఆయన వాహనచోదకులకు అవగాహన కల్పించారు. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి గొడవలకు దిగినా చట్ట ప్రకారం కేసు నమోదవుతుందన్నారు. పోక్సో యాక్టుపై అవగాహన కల్పించారు.

సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

'గడపగడపకు' కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



చిడుమూరులో నగదు లబ్ధిపై లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



పాలగూడెంలో రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు: రాబోయే ఎన్నికల్లో మరోమారు వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు యథావిధిగా అందుతాయని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. చిడుమూరు గ్రామ పంచాయతీ పరిధి నర్సింహాపురం, పాలగూడెం, చిడుమూరులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల్లో వందల హామీలిచ్చి, వాటిని నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను తీవ్రంగా మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం నవరత్నాల పేరుతో తొమ్మిది హామీలను మాత్రమే ఇచ్చి, అంతకంటే ఎక్కువగా అమలు చేసిందని గుర్తు చేశారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ అభివృద్ధి మంత్రమని, ఓడిపోతామన్న నైరాశ్యంలో ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయా పథకాల ద్వారా ఎంత నగదు వచ్చిందో ఆమె లబ్ధిదారులకు వివరించారు. రానున్న కాలంలో మరింత పకడ్బందీగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చిడుమూరు గ్రామ సచివాలయ పరిధిలో నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల నిమిత్తం రూ. 8 కోట్లు, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.2.50 కోట్లు, మొత్తంగా రూ.10.50 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. అనంతరం పాలగూడెంలో రూ.1.75 కోట్లతో నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కాక అరుణకుమారి, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్‌అలీ, జేసీఎస్ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, నాయకులు సీతారామయ్య, జయరాజు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీడీవో రవిబాబు, సీడీపీవో విజయగౌరి పాల్గొన్నారు.

357 మందికి ఇళ్ల స్థలాల హక్కు పత్రాలు





ఇంటి స్థల హక్కు పత్రం, జ్యుడీషియల్ స్టాంపుతో ఇంటి స్థల బదలాయింపు దస్తావేజు పత్రం

పెదబయలు: మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో 357 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల హక్కు పత్రాలు మంజూరైనట్టు ఎంపీడీవో వి.విగ్గిన్స్ తెలిపారు. కుంతుర్ల గ్రామ సచివాలయ పరిధిలో- 38, అడుగులపుట్టు -17, పర్రెడ -27, గోమంగి -34, బొంగరం -23, అరడకోట -57, ఇంజరి -24, బొండాపల్లి -16, గిన్నెలకోట -13, గంపరాయి -32, కిముడుపల్లి -62, సీతగుంట -7, సీకరి -6, పెదకోడాపల్లి -1 మొత్తం 357 ఇళ్ల స్థలాల హక్కు పత్రాలు మంజూరైనట్టు తెలిపారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇంటి పట్టా లబ్ధిదారులకు పూర్తి హక్కు కల్పించడమే లక్ష్యంగా ఉచిత రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు.ఒక్కో లబ్ధిదారుడికి ఈ ప్రాంతంలో ప్రభుత్వ ధర ప్రకారం రూ. లక్ష నుంచి రూ.1.5 లక్షల విలువైన స్థలం ఇచ్చామన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ఇంటి స్థల హక్కు పత్రాలు అందిస్తామన్నారు. దీనికి సచివాలయ సిబ్బంది తేదీలు ఖరారు చేస్తారన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలో ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 741 ఇళ్ల పట్టాలు మండలానికి మంజూరు కాగా వీటిలో 641 పంపిణీ చేశామన్నారు. మిగిలిన వంద ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. హౌస్ సైట్ పట్టాలు 272 మంజూరయ్యాయని, వీటిని త్వరలోనే ఎమ్మెల్యే పంపిణీ చేస్తారన్నారు. మండలానికి 13,079 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు కాగా, ఇప్పటికి 890 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన త్వరితగతిన అందించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు సహకరించాలి



సంక్షేమ పథకాలపై వివరిస్తున్న మత్స్యలింగం

అరకు సమన్వయకర్త మత్స్యలింగం

అరకులోయ రూరల్: వైఎస్సార్ సీపీ గెలుపునకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని వైఎస్సార్ సీపీ అరకు నియోజకవర్గం సమన్వయకర్త రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలో పెదలబుడు, కొత్తభల్లుగుడ, సుంకరమెట్ట పంచాయతీల్లో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న శివారు గ్రామాలు సైతం ప్రగతి పథంలో పయనిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారంలో వస్తే పేద, బడుగు, బలహీన వర్గాలకు మరింత సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందిస్తారన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలకు మించి పథకాలు అందించారన్నారు. టీడీపీ హామీలను ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సత్రుగున్, రాంచందర్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, నాయకులు ఏల్లేష్, మోహన్, రామూర్తి, నొబో, పూర్ణ పాల్గొన్నారు.

సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండండి



యువతకు వాలీబాల్ కిట్లను అందజేస్తున్న ఎస్సై రామకృష్ణ

సీలేరు: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన కొండజర్త, తర్నేవాడ గ్రామాల్లో గురువారం సీలేరు ఎస్సై జె.రామకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అవసరమైన రహదారులు, ఆస్పత్రి, స్కూల్ వంటి ప్రాథమిక అవసరాలు దక్కకుండా మావోయిస్టులు అడ్డుకుంటున్నారని వాపోయారు. గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలని, పోలీసు శాఖ గిరిజనుల సమస్యలు తీరుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం కొండజర్త గ్రామంలో సీలేరు పీహెచ్‌సీ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు.

అన్ని రంగాల్లో యువత రాణించాలి

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక



యువతకు క్రికెట్ బ్యాట్‌లు అందజేస్తున్న అధికార ప్రతినిధి రాధిక, జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్

అరకులోయ రూరల్: అన్ని రంగాల్లో యువత ముందుండాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధికార ప్రతినిధి కొర్రా రాధిక, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. పానిరంగిని గ్రామ యువతకు తమ సొంత ఖర్చులతో సమకూర్చిన క్రికెట్ క్రీడా కిట్లను గురువారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసక్తి ఉన్న యువత క్రీడల్లో రాణించేందుకు తమవంతు సహాయ సహకారం ఉంటుందన్నారు. గత ప్రభుత్వాలకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ రంగాలపై ఆసక్తిగా ఉన్న ప్రతిభావంతులను ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు. క్రీడలతోనే మరింత ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నర్సింగ్, నొబో, గోపాల్, రామూర్తి, పూర్ణ, రాంచందర్, బాలకృష్ణ, ఏల్లేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ వాహన యాత్ర విజయవంతం చేయాలి



రేగులపాటులో వాహనయాత్ర పోస్టర్ ఆవిష్కరించిన దృశ్యం

కూనవరం: ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్‌ల ఆధ్వర్యంలో కూనవరం, భీమవరం, నర్సింగపేట, కాచవరం, పోచవరం కాలనీల్లో ఆదివారం నిర్వహించనున్న వైఎస్సార్ వాహనయాత్ర (రోడ్డు షో)ను విజయవంతం చేయాలని అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరావు కోరారు. గురువారం రేగులపాడులో వాహనయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం ప్రజలను వాహన యాత్రకు సమాయత్తం చేసేందుకు ప్రధాన నాయకులతో చర్చించారు. శుక్రవారం 10.30 గంటలకు కూనవరం పంచాయతీలో, 11.30 గంటలకు బోదునూరు, పాలగూడెం, మెట్టరామవరం, సాయంత్రం 4.00 గంటకు పోచవరం, 5.00 గంటలకు వెంకటాయపాలెం, 6.00 గంటలకు కరకగూడెం, రాత్రి 7.00 గంటలకు చూచిరేవులగూడెం, 8.00 గంటలకు జగ్గవరం పంచాయతీలో వాహన యాత్ర ఆవశ్యాన్ని వివరించనున్నట్లు తెలిపారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మేరుకులం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధరరావు, మాజీ వైస్ ఎంపీపీ గుజ్జాబాబు, ముత్తయ్య పాల్గొన్నారు.

విశ్వేశ్వరరాజుపై విమర్శలు తగదు

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజుపై భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజుబాబు అవాస్తవ ఆరోపణలు చేయటం తగదని సర్పంచ్ ఐసరం హనుమంతరావు తెలిపారు. సొలభం పంచాయతీలో గురువారం ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకి కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చటానికి ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరాజు కారమణమని లేనిపోని ప్రకటనలు చేసి రాజకీయ లబ్ధి పొందటానికి చూస్తున్నాడని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీపైనా, తమ నాయకుడుపైనా తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజా నాయకుడు, నీతినిజాయితీ గల విశ్వేశ్వరరాజుకు రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యం



సింధిపుట్టు గ్రామ గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీపీ సీతమ్మ

ముంచంగిపుట్టు: ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా అందరూ పని చేయాలని ఎంపీపీ అరిసెల సీతమ్మ తెలిపారు. వనుగుమ్మ, దోడిపుట్టు పంచాయతీల్లో పలు గ్రామాల్లో గురువారం ఆమె పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. గిరిజనులతో సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులపై వివరించారు. ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తెచ్చిన జగనన్ననే సీఎంగా చేయాలని కోరారు. గిరిజన ప్రాంతంలో ఎప్పుడూ చూడని అభివృద్ధి, ఇంటి వద్దకే వలంటీర్ల వ్యవస్థతో సంక్షేమ పథకాలు తెచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచులు వసంత, మిల్కి, గంగాధర్, నీలకంఠం, ఎంపీటీసీలు సోహిత, సుబ్బలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల నేతలు జయదేవ్, శివ, పిత్‌బాస్, రాంప్రసాద్, పులిరాజు, పద్మారావు, అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఆర్‌బీకే, సచివాలయాలు ప్రారంభం

అడ్డతీగల: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొననున్నారని ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు ఎల్లవరంలోని గ్రామ సచివాలయం, ఆర్బీకే, 11 గంటలకు అడ్డతీగల సచివాలయం-1, ఆర్బీకే, 11.30 గంటలకు అడ్డతీగల సచివాలయం-2, ఆర్బీకే, మధ్యాహ్నం 12.30 గంటలకు రాయవల్లి సచివాలయం, ఆర్బీకే, 2 గంటలకు వీరవరం సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభిస్తారని పేర్కొన్నాయి. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరాయి.

జగనన్న పాలనలో శివారు గ్రామాలకు రోడ్లు

శంకుస్థాపన కార్యక్రమంలో రేగం మత్స్యలింగం, ఎంపీపీ రాజుబాబు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రేగం మత్స్యలింగం, ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: జగనన్న పాలనలో శివారు గ్రామాల రహదారులకు సైతం మోక్షం కలిగిందని అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలోని సంతారి పంచాయతీ కుడబీరు, జర్రకొండ పంచాయతీ గేదెలపాడు గ్రామాల్లో గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. చిన భూరుగుపుట్టు నుంచి కుడబీరు గ్రామం వరకు రూ.1.15 కోట్లతో, గన్నెరుపుట్టు నుంచి గేదెలపాడు వరకు రూ.2.కోట్లతో బీటీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గతంలో వీటిని ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. మండలంలో ఇప్పటివరకు 32 రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ ధ్రువకుమార్, మండలాధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, సర్పంచ్‌లు పాడి అప్పలనాయుడు, కొర్ర చిట్టిబాబు, నాయకులు లక్ష్మయ్య, వెంకట్, కర్రన్న పాల్గొన్నారు.

బాబా ఆలయం వద్ద అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మరిసే లక్ష్మి ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భక్తులు వచ్చి స్వీకరించారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు బాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రేపు గ్రామ సచివాలయాల ప్రారంభం

కొయ్యూరు: మండలంలో గ్రామ సచివాలయాల భవనాలను పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభిస్తారని ఎంపీడీవో లాలం సీతయ్య గురువారం తెలిపారు. మొదట రావణాపల్లిలో అనంతరం మంపలో సచివాలయం, ఆర్బీకే ప్రారంభిస్తారన్నారు.